# సత్యవాక్యము

## క్రైస్తవ మాసపత్రిక




**March 1994**

# THE WORD OF TRUTH

# సంక్షిప్త వార్తలు

1994 ఫిబ్రవరి 7వ తేదీన **Bro. N. Titus** గారి కుమార్తె మేరీ కొయుక్కు వివాహమునకు సోదరులు జాషువా గూటం ఆహ్వానించ బడిరి. ఆ వివాహము ఘనముగా జరిగెను.

జాషువాగారు కుటుంబ సమేతముగా ఫిబ్రవరి 8 నుండి 14 వరకు ఒరిస్సాలో పర్యటించిరి. 11వ తేదీ సాయంకాలం ఉమర్ కోట్‌లో సోదరి కబితాగారి తమ్ముని వివాహమునకు హాజరైరి. జాషువా దంపతులు ఒరిస్సాలో ఉమర్ కోట్, నవరంగపూర్, బోరిగుమ, జేపూర్, కోరాపుట్, పొట్టంగి పట్టణములు సందర్శించి ఒరియా బైబిలు కోర్సు చేయుచున్న పలువురు విద్యార్థులను కలుసుకొనిరి.

* * *

ఫిబ్రవరి నెల సువార్తికుల సదస్సు మరియు సువార్తకూటము 22వ తేదీ మంగళవారం పలివెల గ్రామంలో జరిగెను. ఆరోజు "ఆరాధన అనగా నేమి ? ఆత్మతోను సత్యముతోను ఆరాధించుట ఎట్లు?" అను అంశము చర్చింపబడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు జి. ప్రడక్ గారు అధ్యక్షత వహించిరి. సోదరులు R. స్టీవెన్ సన్ గారు, N. మోజెస్ గారు, P. సుందరావుగారు, D. ఇశ్రాయేలుగారు, M. L క్రిస్టోఫర్ గారు, S. జాకబ్ గారు, V. చిన్నయ్యగారు చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశమునకు సోదరులు N. ఏలియాగారు అధ్యక్షత వహించిరి. సోదరులు పాల్ గూటంగారు, P. ప్రకాశంగారు మరియు జాషువా గూటంగారు పై అంశముపై చక్కని వర్తమానము నందించిరి.

సువార్త దండయాత్ర అనంతరం 21 మంది బాప్తిస్మము పొందిరి. వేలకొలది కరపత్రములు పంచిపెట్టబడెను. రాత్రి కూటమునకు సోదరులు E.K.V. ప్రసాదరావ్ గారు అధ్యక్షత వహించగా V. చిన్నయ్యగారు, పాల్ గూటంగారు వాక్యోపదేశము చేసిరి.

(తరువాయి టైటిల్ 3వ పేజీలో)

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14    మార్చి 1994    సంచిక 8


## సంపాదకీయము

### తప్పిపోవుట యనగా నేమి ?

### ( What it Means to be Lost ?)

మీరు ఎప్పుడైనా యెచ్చటికైనా వెళ్ళినప్పుడు తప్పిపోతిరా ? అట్లు జరిగి యుండినచో అది యెంత భయంకరమైన అనుభవమో ! ఒక చిన్న బిడ్డ తల్లిదండ్రులనుండి తప్పిపోవుట చూచితిరా ? ఆ బిడ్డ కండ్లలో భయము, సహాయము కొరకు యేడ్పు కనబడును. దీని యంతటికంటె ఆత్మీయముగ తప్పిపోవుట ఎంతో భయంకరము.

తప్పిపోవుట యనగా యేమిటో గ్రహించుటకు సహాయపడునట్లు, తప్పిపోయిన వ్యక్తియొక్క పరిస్థితిని గూర్చియు, ఆ వ్యక్తి దేనిని విడిచిపెట్టెనో లేక ఏమి పోగొట్టుకొనెనో, అతడట్టి నిర్ణయమును తీసుకొనుటను బట్టి కలిగిన ఫలితములను భరించుటను గూర్చి ఆలోచించవలసి యున్నది. ఈ విషయము లన్నిటిని బుద్ధిపూర్వకముగా

అతడు నిర్లక్ష్యము చేసినచో అట్టి స్థితిలో నిలిచియుండుటకు అతడు ఆలోచన కలిగియుండెను.

ఒక వ్యక్తి తప్పిపోయిన యెడల లేక రక్షింపబడని యెడల అతడు పాపములో నిలిచియున్నాడని యర్థము. ప్రజలందరు పాపులుగనే జన్మించిరా? లేక పాపములో యుంటిరా? లేదు మంచి చెడుగులు గ్రహించగల వయస్సు వచ్చిన పిమ్మట అతడు పాపి యగును. అపొస్తలుడైన యోహాను సకల దుర్నీతియు పాపమని చెప్పుచున్నాడు (1 యోహాను 5:17). పాపము అపవాదినుండి కలిగినదని అతడు చెప్పు చెప్పుచున్నాడు (1 యోహాను 3 : 8). ఆజ్ఞాతి క్రమమే పాపము (1 యోహాను 3 : 4). పాపి ఆజ్ఞను అతిక్రమించును, చెడుకార్యములను జరిగించును. "శరీర కార్యములు స్పష్టమై యున్నవి; అవేవనగా: జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. వీటిని గూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగ చెప్పుచున్నాను" (గలతీ 5:19-21). అయితే నీతి గలిగి మంచి జీవితము జీవించువాని గతి యేమి ? ఏ మానవుడు కూడ పరిశుద్ధుడు కాదు గనుక అతడు కూడ పాపియే. దీనితో కూడిన మంచి జీవితము జీవించు వ్యక్తి దేవునివైపుకు తిరుగుటకు బదులు రక్షించుటకు తన నీతిపైననే ఆధారపడి యుండును. అయితే అట్టి మంచితన మతనిని రక్షింపనేరదు. తనను తాను రక్షించుకొనుటకు గాను యే మానవునికి తన మంచితనము సరిపోదు.

తప్పిపోవుట యనగా ఒకడు చీకటిలో యుండెనన్న మాట బైబిలు గ్రంథములో చీకటి పాపమునకు, చెడుగునకు, కీడుకు సూచనగా

చాల పర్యాయములు వాడబడినది. ఒక వ్యక్తి తన జీవితమంతయు పూర్తి చీకటిలో యుండినట్లయిన అతడు యెన్నో సౌందర్యమైనట్టి, ఆశ్చర్యమైనట్టి విషయములను పోగొట్టుకొనును గదా. అయితే ఆత్మీయ చీకటిని గూర్చిన విషయమేమి? ఒకడు తన జీవితమంతయు ఆత్మీయ అంధకారములో యుండి, ఆఖరిగా వెలుపల చీకటిలోనికి త్రోయబడి నిత్యమూ అట్టి స్థితిలో జీవించుట ఎంత భయంకరము! (ఎఫెసి 5:11; 1 యోహాను 2:9; 2 పేతురు 2:4). తప్పిపోవుట యనగా అర్థ మిదే.

ఒక వ్యక్తి ఆత్మీయముగా తప్పిపోయినట్లయిన అతనికి దేవుడు లేడన్న మాట. యెషయా ఈ విధముగా చెప్పుచున్నాడు. "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు; విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు; మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను గనుక ఆయన ఆలకింపక యున్నాడు (యెషయా 59:1-2). పేతురిట్లు చెప్పుచున్నాడు: "ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడుచేయు వారికి విరోధముగా యున్నది (1 పేతురు 3 : 12). ఒకని జీవితములో ఒక్క సెకనుకూడ దేవుడు లేకుండా గడపుట యెంత భయంకరము! ఆ వ్యక్తి అట్లు ఏలాగు జీవించ గలడు? దేవుడు లేకుండా ఆ వ్యక్తి మరణించినట్లయిన అతని జీవితము ఎంత విషాదకరమో గదా!

క్రీస్తును కలిగి యుండనందున లేక క్రీస్తుకు బయట ఉండినందున ఒక వ్యక్తి తప్పిపోవుట అనగా తనను రక్షించుట కొరకు వచ్చినవానిని, తన పాపములనుండి శుద్ధి చేయుటకు చనిపోయిన వానిని నిరాకరించును అనగా అతడింకను పాపములోనే యుండును. అందువలన క్రీస్తు ప్రభువునుండి కలుగు ఆత్మీయ దీవెన లన్నిటిని పోగొట్టుకొనును.

క్రీస్తు ప్రభువు యిట్లు చెప్పుచున్నాడు: "మీకు జీవము కలుగునట్లు మీరు నా యొద్దకు రానొల్లరు" (యోహాను 5:40). ఈ పై వాక్యము తప్పిపోవుటను గూర్చిన భావమును విశదపరచుచున్నది. ఎవరైతే క్రీస్తు నొద్దకు రానొల్లరో వారికి రక్షణ కలుగదు. అట్టివారు రక్షింపబడలేరు.

ఒక పాపి క్రీస్తు సువార్తకు విధేయుడగుటకు నిరాకరించినంత కాలముకూడ అతనికి రక్షణ కలుగదు. యేసుప్రభువు తన శిష్యులకు ఈ విధముగా ఆజ్ఞాపించెను: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). సువార్తకు విధేయులు కానివారెవరో రక్షింపబడితిమని తలంతురు కాని వారు రక్షింపబడలేదని ప్రభువు చెప్పుచున్నారు. విధేయతతో తన్ను తాను దేవునికి సమర్పించుకొనిననే గాని అతడు రక్షణ పొందడు.

సంఘమునకు వెలుపల నున్న వ్యక్తి క్రీస్తును, రక్షణను లేని వానితో సమానము. అనగా అతడు తప్పిపోయినవాడు. పౌలు, "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసి 5:23) అని చెప్పుచున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడని చెప్పినదానిని గమనించండి. ఇచ్చట శరీర మేది? అదే గ్రంథకర్త శరీరము సంఘమని చెప్పుచున్నాడు (ఎఫెసి 1:22, 23; కొలస్స 1:18), సంఘమును గూర్చి యెవరు యేమి తలంచినను ఒకడు రక్షింపబడునట్లు సంఘ సభ్యునిగా యుండవలెను. ఆ శరీరమునకు (సంఘము అయిన శరీరము) క్రీస్తే రక్షకుడు. అతడు ఆ శరీరములోని ఒక భాగము అనగా సంఘ సభ్యుడు కానిచో అతడు తప్పిపోయినవాడు. ఒక దినమున క్రీస్తు ప్రభువు ఆయన రాజ్యమును లేక సంఘమును తీసికొని తండ్రికి అప్పగించుటకు తిరిగి వచ్చును (ఎఫెసి 5 : 27; 1 కొరింథి 15 : 24).

"అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును; అప్పుడు అంతము వచ్చును". అట్టి సమయమునకు ఒక వ్యక్తి ఆ రాజ్యములో ఒక సభ్యుడుగా యుండనట్లయిన అతని గతి యేమి? అతడు సంఘములో లేక రాజ్యములో సభ్యునిగా లేనిచో అతడు నిత్యనాశనము పొందునని పరిశుద్ధ గ్రంథము చెప్పుచున్నది.

తప్పిపోయిన వానికి నిరీక్షణ లేదు. అతడు తన్ను తాను రక్షించుకొనలేడు; సరిగదా యే మనుష్యుని వలనగాని, మనుష్యుడు కల్పించిన యే పద్ధతివలన గాని అతనికి రక్షణ కలుగదు. రక్షణ లేని స్థితిలో అతడు జీవించుచుండిన అతడు తప్పిపోయినవాడు, అట్టి స్థితిలో అతడు మరణించిన అతడు నిరీక్షణలేని స్థితిలోనే నిత్యమూ ఉండును. రెండవ తరుణము గాని, తప్పించుకొను మార్గముగాని వానికిక ఉండదు. నిత్యనరకములో సాతానుతో అతడు నిత్యమూ జీవించవలసి యుండును. "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధికులును, అబద్ధికులందరును అగ్నిగంధకములతో మండు గుండములో పాలు పొందుదురు; ఇది రెండవ మరణము" (ప్రకటన 21 : 8). పౌలు ఎఫెసులోని క్రైస్తవులకు ఒకప్పుడు వారు నిరీక్షణ లేనివారుగాను, దేవుడు లేని వారుగాను ఈ లోకములో యుండిరని జ్ఞాపకము చేయుచున్నాడు. "ఆ కాలమందు ఇశ్రాయేలుతో సహ పౌరులు కాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలులేని పరజనులును, నిరీక్షణ లేనివారును, లోకమందు దేవుడు లేనివారునై యుండి క్రీస్తుకు దూరస్థులై యుంటిరని మీరు జ్ఞాపకము చేసుకొనుడి" (ఎఫెసి 2 : 12). అది యెట్లుండునో ఆ స్థితిని మనము ఊహించుకొనగలమా? అట్టి దుస్థితిని గూర్చి మనము

ఆలోచించి నట్లయిన ఒక్క సెకనుకూడ అట్టి భయంకర జీవితమును గడుపుటకు యిష్టపడరని నేను తలంచుచున్నాను.

ఈ చెప్పబడిన విషయ మంతటిని బట్టి "తప్పిపోవుట" యనగా యేమిటో క్లుప్తముగ వివరించితిని. మీరు తప్పిపోయిన స్థితిలోనే యింకను జీవించుచున్నట్లయిన వెంటనే మీరు మార్పును కోరునట్లు మీ కొరకు ప్రార్థించుదుము. అదే రీతిలో యుండిన మీరు సమస్తము పోగొట్టుకొందురు, మీకు కలిగే ఫలితమేమి లేదు. మీరు మీ స్థితిని మార్చుకొని దేవునియందు విశ్వాసముంచి ఆయన చిత్తమునకు విధేయులగుట ఎంతో సులభము. ఆయనే మిమ్మును రక్షించును, ఆయన సంఘములోనికి అనగా ఆయన కుటుంబము లోనికి మిమ్మును చేర్చును; నిత్యజీవమును గూర్చిన నిరీక్షణను కలిగించును. మీకు యింకా సమయమీయబడి యుండగా మీకీయబడిన తరుణమును సద్వినియోగము చేసుకొనునట్లు మీ కొరకు ప్రార్థన చేయుదుము. రేపు అనేది చాల ఆలస్యమనే విషయమును జ్ఞాపకముంచుకొనండి.

---

## రక్షించునట్టి విశ్వాసము
## (The Faith that Saves)

మానవులు రక్షించబడవలెనంటె విశ్వాసము అత్యవసరము. విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. "నేను ఆయనను (అనగా దేవుని కుమారుని) అని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు" అని యేసు చెప్పెను (యోహాను 8 : 24). గనుక మనము విశ్వాసము కలిగియుండుట చాల అవుసరము.

అయితే విశ్వాసము ఒక్కటి మాత్రమే సరిపోవునా? మనము రక్షించబడవలెనంటె ఎట్టి విశ్వాసమును మనము కలిగియుండవలెను?

రక్షించునట్టి విశ్వాసము ఎట్టిది ? దేవుని వాక్యము దీని విషయమై ఏమి చెప్పుచున్నది ? దానిని కొంత ఇప్పుడు చూచుకొందము. యాకోబు 2:14-26 వరకు ఇప్పుడు చదువుకొందము.

## క్రియలు అవసరం

"నా సోదరులారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా? సహోదరుడైనను, సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేక యున్నప్పుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసినవాటిని ఇయ్యక-సమాధానముగా వెళ్లుడి, చలి కాచుకొనుడి, తృప్తి పొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము ? ఆలాగే విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును... దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. ఆలాగు నమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి వణకుచున్నవి; వ్యర్థుడా, క్రియలు లేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసికొనగోరుచున్నావా ? మన పితరుడైన అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును బలిపీఠముమీద అర్పించినప్పుడు అతడు క్రియలవలన నీతిమంతుడని తీర్పు పొందలేదా? విశ్వాసము అతని క్రియలతోకూడి కార్యసిద్ధి కలుగజేసెననియు, క్రియలు మూలముగా అతని విశ్వాసము పరిపూర్ణమైనదనియు గ్రహించుచున్నావుగదా?...కాబట్టి మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రమే కాక (Not by faith only) క్రియల మూలముననను నీతిమంతుడని, మీరు దీనివలన గ్రహించితిరి; "ప్రాణము లేని శరీరము ఏలాగు మృతమో ఆలాగే క్రియలులేని విశ్వాసము మృతము".

యాకోబు వ్రాసిన సంగతిని గమనించుడి. మీకు విశ్వాసము ఉన్నంత మాత్రమున అది సరిపోదు. మీ విశ్వాసమునకు క్రియలు జోడించుడి. అప్పుడు మాత్రమే మీరు నీతిమంతులని యెంచబడుదురు.

మీ విశ్వాసమునకు మీరు విధేయులు కానియెడల అట్టి విశ్వాసము మిమ్మును రక్షించదు. విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును. అబ్రాహాముయొక్క విశ్వాసము ఎట్లు పరిపూర్ణమాయెను ? అతడు దేవునియందు విశ్వసించుటయే కాకుండ దేవుని మాటలకు పరిపూర్ణ విధేయత చూపించుటవలననే కదా? ఈనాడు మనము పరిపూర్ణులము ఎట్లు కాగలుగుదుము? దేవుని వాక్యమును విశ్వసించుటయే కాదుగాని, ఆ వాక్యమునకు విధేయత చూపుట ద్వారానే కదా ? యేసుప్రభువు నందు నేను విశ్వసించుచున్నాను గాని, నేను ఆయన నామమున బాప్తిస్మము పొందుటకు నాకు ఇష్టము లేదు అని నీవు చెప్పవచ్చును. అట్టి విశ్వాసము నిన్ను రక్షించ గలదా? ప్రాణము లేని శరీరము ఏలాగు చచ్చినది అగునో ఆలాగే క్రియలద్వారా విధేయత చూపని విశ్వాసముకూడాను చచ్చినదగును.

## విశ్వాస వీరులు

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11వ అధ్యాయమును మనము చూచినయెడల అనేకమంది విశ్వాస వీరులను గూర్చి పరిశుద్ధాత్ముడు అందు మనకు సాక్ష్యమిచ్చుచున్నాడు. విశ్వాసమును బట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్ఠమైన బలిని దేవునికి అర్పించెను. విశ్వాసమును బట్టి హనోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను. విశ్వాసమునుబట్టి నోవహు తన ఇంటివారి రక్షణకొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. విశ్వాసమునుబట్టి అబ్రాహాము పిలవబడినప్పుడు ఎక్కడికి వెళ్ళవలెనో అది ఎరుగక బయలు వెళ్ళెను. విశ్వాసమును బట్టి ఇస్సాకు, యాకోబు, యోసేపులు దేవుని చిత్తమును జరిగించిరి. విశ్వాసమునుబట్టి మోషే ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి

పనిచేసెను. ఇకను ఏమి చెప్పుదును? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలును గూర్చియు, ప్రవక్తలను గూర్చియు వివరించుటకు సమయము చాలదు. వారి విశ్వాసముద్వారా రాజ్యములను జయించిరి. నీతి కార్యములను జరిగించిరి, వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్ళను మూసిరి. అగ్ని బలమును చల్లార్చిరి, ఖడ్గధారను తప్పించుకొనిరి, బలహీనులుగా ఉండి బలపర్చబడిరి. వారు విశ్వాసముద్వారా చేసిన అనేక ఘనకార్యములను గూర్చి మనము చెప్పుకొనవచ్చును. అయితే వీరందరు ఘనులెట్లయిరి? వారందరు తమ విశ్వాసమును క్రియలద్వారా నిరూపించుట వలననేగదా? వారిలో ప్రతి ఒక్కడు కూడ దేవుడు వాని కేమి ఆజ్ఞాపించెనో ఆ ఆజ్ఞను అక్షరాల నెరవేర్చిరి. వారందరు దేవుని యెడల తమకున్న విశ్వాసమునుబట్టి విధేయత చూపించిరి. అందువలన వారు నీతిమంతులని తీర్చబడిరి. వారి విధేయతద్వారా వారి విశ్వాసము పరిపూర్ణమాయెను. అవిధేయత చూపుచు దేవునికి నమ్మకముగా నున్న ఏ ఒక్కని గూర్చియైనను బైబిలు బోధించుటలేదు. సరిగదా విశ్వాసులలో అవిధేయతను దేవుడు ఖండిచుటయేగాక శిక్షించినట్లు బైబలునందు అనేక సందర్భములలో మనము చూడగలము. "ఒకడు దహనబలులను అర్పించుటవలన ఆయన సంతోషించునా? ఆలోచించుము. బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్ఠము" అని దైవవేదము బోధించుచున్నది (1 సమూ 15:22).

విశ్వాసము మనలను ఎట్లు రక్షించును? మనము దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుటకు ప్రోత్సహించుటద్వారా, అది మనలను రక్షించును. దేవుని వాక్యమును వినుటద్వారా చదువుటద్వారా మనకు ఆ విశ్వాసము కలుగును (రోమా 10 : 17, యోహాను

20:30-31). ఒకడు రక్షింపబడవలెనంటే అతడు చేయవలసిన కొన్ని పనులున్నవి. పాపులైనవారు యేసునందు విశ్వాస ముంచవలెనని దేవుని వాక్యము ఆజ్ఞాపించుచున్నది. "నేను ఆయనను అని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనే మరణింతురు" అని యేసు చెప్పుచున్నాడు.

## విశ్వాసము మాత్రమే చాలునా ?

అనేకులు యేసు దేవుడు, దేవుని కుమారుడు అని విశ్వసించి అంతటితో ఆగిపోవుదురు. నేను యేసుప్రభువును నా ఆత్మ రక్షకునిగా అంగీకరించుచున్నాను అని అనేకులు మాకు ఉత్తరాలు వ్రాస్తూయుంటారు. యేసునందు విశ్వాసముంచగానే, లేదా ఆయనను అంగీకరించగానే మేము రక్షించబడితిమి అని వారి అభిప్రాయము అయితే అట్టి విశ్వాసము ఒక్కటి మాత్రమే రక్షించగలదా? నీవు యేసుప్రభువునందు నమ్మికొనుము. వెంటనే నీవు రక్షింపబడుదువు అని అనేకులు బోధించుచున్నారు. నీవు నమ్మినంత మాత్రముననే రక్షింపబడుదువని వాక్యము చెప్పుచున్నదా? విశ్వసించిన మాత్రముననే నీవు రక్షింపబడగలవా? యాకోబు 2:24 ఏమి చెప్పుచున్నది? "మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రము కాక క్రియల మూలముననను నీతిమంతుడని యెంచబడును" అని చెప్పుచున్నది. ఇందులో ఏది సత్యము ? మానవుల సిద్ధాంతములా లేక దేవుని వాక్యమా? మన ఆత్మ రక్షణకు దేవుని వాక్యమునే అంగీకరించుట మనకు క్షేమకరము గదా ?

అవును, నీవు యేసునందు విశ్వాసముంచావు, బాగున్నది. విశ్వసించిన నీవు మారుమనస్సు పొందవలెనని యేసు ఆజ్ఞాపించుచున్నాడు: "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు" అని లూకా 13:3లో ఆయన చెప్పుచున్నాడు. అటు తరువాత యేసు దేవుని కుమారుడు అని నీవు విశ్వసించుచున్నట్లు,

నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని యేసు చెప్పుచున్నాడు. "మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును" అని మత్తయి 10 : 32 లో ఆయన చెప్పుచున్నాడు. అనేకులు నీ పాపములను మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని బోధింతురు. పాపములను మనము దేవుని యెదుట ఒప్పుకొనవలెను. మనుష్యులయెదుటయితే మన విశ్వాసమును ఒప్పుకొనవలెనని బైబిలు బోధించుచున్నది.

నీవు యేసునందు విశ్వసించావు. పాపముల విషయమై మనస్సు మార్చుకొన్నావు. యేసు దేవుని కుమారుడని ఒప్పుకొంటావు. బావుంది. అయితే క్రీస్తు ఇచ్చు రక్షణలోనికి ప్రవేశించుటకు ఒకే ఒక్కటి నీవు చేయవలెను: బాప్తిస్మము పొందవలెను. అబ్బే నేను నీవు చెప్పినవన్నీ చేయుదునుగాని బాప్తిస్మము అవుసరం లేదనుకుంటాను అని నీవు అనుకొనవచ్చును. మార్కు 16:16 లో యేసు ఏమి చెప్పుచున్నాడో ఒక్కసారి వినండి: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును". నీ విశ్వాసమునకు బాప్తిస్మము పొందుట ద్వారా విధేయత చూపించుము. అపో.కా. 2:38లో "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" అని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు. బాప్తిస్మముద్వారా ప్రభువు నీ పాపములను కడిగివేయును. బాప్తిస్మము పొందిన తరువాతనే నీవు రక్షించబడుదువు గాని దానికి ముందు కాదు. "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" అని 1 పేతురు 3:21 చెప్పుచున్నది.

మీలో ఎవరయినను నేను విశ్వసించగానే రక్షింపబడితిని అని అనుకొనుకొనుచున్న యెడల యేసుప్రభువు గాని, పరిశుద్ధాత్ముడు గాని, అపొస్తలులుగాని అట్లు బోధించుటలేదని గ్రహించుడి. విధేయత

చూపించు విశ్వాసమే రక్షించునట్టి విశ్వాసము. విశ్వాస మొక్కటి మాత్రమే ఎన్నడు ఎవరినీ, ఎక్కడా రక్షించలేదు. అట్లయిన దయ్యములు కూడ రక్షించబడును గదా ?

—జాషువా గూటం.

—o—

## పుట్టినరోజు పండుగ

యేసు - "నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:20). "నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను" (లూకా 22 : 19). మీరు ఈ రొట్టెను తిని, ఈ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు" అని పౌలు 1 కొరింథీ 11 : 26 లో చెప్పెను. నా జన్మదినమును జ్ఞాపకము చేసికొనమని చెప్పెనా ? మరణమును జ్ఞాపకము చేసికొమ్మని ఆజ్ఞాపించెనా ? సర్వజనులకు ఏమి ప్రకటింపమని ఆజ్ఞాపించెను ? సువార్తనా? ఔను గదా ! అయితే సువార్త అంటే ఏమిటి? "అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథీ 15:3-5). నీ ఆత్మ రక్షణ క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానముల యందలి విశ్వాసము, విధేయతల వలననా? లేక, క్రీస్తు జన్మదినమును పండుగగా ఆచరించుట వలననా? క్రీస్తు ఆజ్ఞాపించనివి నీవు చేయుట దేవుని వాక్యమునకు కలుపుట అని నీవెరుగవా? ఆ విధముగా చేసి నీవు శాపగ్రస్తుడవు కానేల? నా జన్మదినమును జ్ఞాపకము

చేసికొని, పండుగ ఆచరించుడి అని పరిశుద్ధాత్ముడు ఆజ్ఞాపించ లేదు గనుక దానితో నీకేమి ?

నీ జీవమునకును భక్తికిని కావలసినవి దేవుడు బయల్పరచెను (II పేతురు 1:3). వాటితో నీకు తృప్తి లేదా? క్రీస్తు జన్మించిన తేదీ బైబిలునందు బయల్పరచబడ లేదు. నిత్యుడును, పరిశుద్ధాత్ముడైన దేవుడు తన గ్రంథమందు ఎందుకు వ్రాయింపలేదో నీ వెప్పుడైనా ఆలోచించితివా? లేఖనములను పరిశోధించితివా ?

1. "అల్ఫాయు ఓమేగయు నేనే. వర్తమాన భూతభవిష్యత్కాలములలో ఉండువాడను నేనే యని దేవుడనగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (ప్రకటన 1:8). ఈ వాక్యప్రకారము ఆదియు, అంతము క్రీస్తే. ఆయన నిత్యుడు, ఆయన 'ఉన్నవాడై' యున్నాడు (నిర్గమ 3 : 14).

2. ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజముల మీద రాజ్యభార ముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి అని అతనికి పేరుపెట్టబడును (యెషయా 9:6). "బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి" అని ఎవరికి పేరు పెట్టబడెను? క్రీస్తుకే గదా? గనుక ఆయన నిత్యము యున్న దేవుడు. "అబ్రాహాము పుట్టక మునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని యోహాను 8 : 58 లో యేసు పల్కినమాట పై లేఖనమును ఋజువు చేయుచున్నది. ఆయన నిత్యుడగు తండ్రి గనుక ఆయనకొక జన్మదినము నిర్ణయించి, ఆచరించుట ఆయనను అనిత్యునిగా జేసి అగౌరపరచుటయే. "యెహోవా ఆత్మకు నేర్పుటకు నీ వెవడవు ? ఆయన నిన్ను ఆలోచన అడిగెనా?" (యెషయా 40:13). "పర్వతములు

పుట్టక మునుపు భూమిని, లోకమును నీవు పుట్టింపక మునుపు యుగ యుగములు నీవే దేవుడవు" అని దైవజనుడైన మోషే ప్రార్థించి నట్లు నీవు ఆయన నిత్యత్వమును ఘనపరచవలసి యున్నది (కీర్తనలు 90 : 2).

3. "బెత్లెహేము ఎఫ్రాతా, యూదా వారి కుటుంబములలో నీవు స్వల్ప గ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవు వాడు నీలోనుండి వచ్చును; పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము వరకు ఆయన ప్రత్యక్షమగుచుండెను" (మీకా 5:2). ఆయన ఎప్పటినుండి ప్రత్యక్షపరచబడుచున్నాడు? కన్య మరియ గర్భమున శరీరధారిగా ఉద్భవించి నప్పటినుండేనా? పురాతన కాలమునుండియా? "ఆయన అదృశ్య దేవుని స్వరూపమై సర్వసృష్టికి ఆది సంభూతుడై యున్నాడు" (కొలస్స 1 : 15). అట్టి ఆది సంభూతునికి నాసికారంధ్ర ములలో ఊపిరిగల నీవు నీకిష్టమైన ఒక తేదీ నిర్ణయించుట ఆమోద యోగ్యమైనదా? ఆయన శరీరధారియై జన్మించుట వాస్తవమే. ఐనను ఆ తేదీ తన గ్రంథమునకు మరుగుపరచి ఆయన యొక్క ఉనికిని, సహజతను నీకు బయల్పరచినందువలన, ఆయనయొక్క నిత్యత్వమును మాత్రమే నీవు మహిమపరచవలసి యున్నది. నీవు నిత్యము ఆయ నతో వసింపగోరుచున్న యెడల ఆయన మరణ, సమాధి, పునరుత్థాన ముల యందు విశ్వసించి, ఆయన ఆజ్ఞలకు మాత్రమే విధేయత జూపుము (రోమా 6:3, 4).

4. "ఆదియందు వాక్యముండెను, ఆ వాక్యము దేవునియొద్ద ఉండెను, ఆ వాక్యము దేవుడై యుండెను. ఆ వాక్యము శరీరధారియై కృపా సత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను" (యోహాను 1:1, 14). సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. "నాకు ముందుగా ఏ దేవుడును

నిర్మింపబడలేదు. నా తరువాత ఏ దేవుడును యుండడు" (యెషయా 43:10). సర్వము ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను (కొలస్స 1:16).

5. "అరణ్యములో యెహోవాకు మార్గము సిద్ధపరచుడి" (యెషయా 40 : 3). "ఇదిగో నాకు ముందుగా నా దూతను పంపుచున్నాను" (మలాకీ 3:1; 4:5, 6). ముంచడము యిచ్చిన యోహాను యెహోవాకు మార్గము సరాళము చేసెను (మత్తయి 3:3). ఆయన మనకు పాపవిముక్తి పరలోక భాగ్యము ప్రసాదించెను. "నేనే మార్గమును" (యోహాను 14:6). "నేనే ద్వారమును; నాద్వారా ఎవడైనను లోపలికి ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడును" (యోహాను 10:9) యని ప్రభువైన క్రీస్తు బోధించెను. ఆయన సిలువపై మరణించి, పునరుత్థానము నొందుటవలననే నీకు నిత్యమైన రక్షణానందమును సిద్ధపరచెనేగాని నీవు ఆయన పుట్టిన దినమని నిర్ణయించి పండుగ చేసుకొనుట వలన కాదు.

"శరీర మూలముగా జన్మించినది శరీరమును, ఆత్మమూలముగా జన్మించినది ఆత్మయునై యున్నది" (యోహాను 3:6). నీవు ఆత్మీయముగా క్రీస్తునందు పుట్టితివా? లేనట్లయితే, "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘములో" (అపొ.కా. 20:28) చేర్చబడి ఆయనను ఆత్మతోను సత్యముతోను ఆరాధించుము. "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము, అనగా మహా దేవుడును మన రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురు చూచుచు, ఈ లోకములో స్వస్థబుద్ధితోను నీతితోను భక్తితోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించియున్నది" (తీతు 2:11-13).

—S.P. దాస్, హైదరాబాద్.

# ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు

## ( Blessed are the Poor in Spirit )

(మత్తయి 5 : 3)

"యేసుప్రభువు ఆయన యొద్దకు వచ్చుచున్న జనసమూహము లను చూచి కొండ యెక్కి కూర్చుండగా ఆయన శిష్యులాయన దగ్గ రకు వచ్చిరి. అప్పుడాయన నోరు తెరచి యీలాగు బోధింపసాగెను. ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు పరలోక రాజ్యము వారిది" (మత్తయి 5 : 13). ఈ మాటలను యేసుప్రభువు గలిలయలోని ఒక కొండమీద నుండి చెప్పెను. ఆయన ఈ కొండమీద చేసిన ప్రసంగ మును మత్తయి 5, 6, 7 అధ్యాయములలో కనుగొనగలము. దానిలో మొదటి భాగము ధన్యతలను గూర్చి యున్నది. ధన్యత అనగా దీవెన లేక దీవించబడుట. ధన్యుడు అనగా దీవించబడినవాడు అని యర్థము.

"ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు" అని యేసుప్రభువు చెప్పారు. ఈ మాటలు లౌకిక తలంపులకు కేవలము విరుద్ధమైనవి. ఈలోక సంబంధ వాదము వేరు. ఈ లోకంలో ధనవంతులు ధన్యులు. గొప్పవారు పలుకుబడిగల వారు ధన్యులు. భూమిమీద ధనము కూర్చుకొనువారు ధన్యులు. గొప్ప విద్యావంతులు, రాజకీయ నాయ కులు ధన్యులు. సుఖసంపదలతో తులతూగువారు ధన్యులని లోకస్థులు చెబుతారు. యేసుప్రభువైతే ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యు లని చెప్పారు.

ఆత్మ విషయమై దీనులైయుండుట అనగా యేమిటి? ఈలోకంలో దీనులైయుండుట అంటే పేదవారై యుండుట యేమిటో మనలో చాల మందికి తెలియును. బీదతనము వలన అనారోగ్యము వలన దీనులై

యుండుట యేమిటో మనకు బాగుగా తెలియును. అయితే ఈ లోకాస్థులు లేకపోవడమే బీదతనము కాదు. ఒకనికి అన్నీ వుండికూడ అతడు యేమీ లేనివాడుగా యుండవచ్చును. తనకు లేమిమైనదేదో తెలిసికొనగానే ఒకడు బీదవాడని ఎంచుకోవచ్చును. ఒకవూరినుండి ఇంకో వూరికి తిరుగులాడు కొన్ని జాతులవారు మన దేశంలో కలరు. వారికున్నదంతా గాడిదలమీదనో లేక వారి భుజాలమీదనో మోసుకెళ్తారు. వారికున్నా సంగతులు స్వల్పమే అయినా వారు బీదవారు కారు. వారికి కావలసినదంతా వారికున్నది. ఉన్నవాటితో వారు సంతృప్తి చెందినవారు.

ఆత్మ విషయమై దీనులైయుండుట అనగా ఆత్మకు కావలసిన విషయాల్లో బహు లేమి కలిగి యుండుట, ఆత్మీయ విషయాల్లో బీదతనము కలిగియుండుట. ఆ లేమిని, బీదతనమును ఎరిగియుండుట అన్న మాట. రక్షింపబడని మానవుడు ఆత్మీయాశీర్వాదము లన్నిటిని కోల్పోయినవాడు. ఏలయనగా అతడు క్రీస్తుకు వెలుపలయున్నవాడు. క్రీస్తులోనే సమస్త ఆత్మీయాశీర్వాదము లున్నాయి (ఎఫెసీ 1 : 3). రక్షింపబడని మానవుడు తన జీవితంలో దేవునియొక్కయు క్రీస్తుయొక్కయు ఆవశ్యకతను గుర్తించాలి. అతనికి రక్షణవసరం. పాపము నుండి పవిత్ర పరచబడుట అవసరం. అతనికి విశ్వాసము, నీతి, నిరీక్షణ అవసరం. యివి లేకుండా అతడు ఆత్మవిషయమై నిరుపేదవాడే.

"నేను పాపులనే పిలువవచ్చితిని గాని నీతిమంతులను పిలువ రాలేదని" యేసు చెప్పినప్పుడు (లూకా 5:31), ఆయన అక్కరలేని నీతిమంతు లున్నారని ఆయనయొక్క ఉద్దేశ్యం కాదు. వివేక విశిష్టుడైన ప్రతి మానవుడు పాపము చేసినవాడే (రోమా 3:23). అయితే యేసు కాలములో కొందరు పరిసయ్యులుండేవారు. యేసుప్రభువు కంటే మేమే పరిశుద్ధులమని, అందువలన ఆయన అవసరత మాకు

లేదని వారు తలంచేవారు. అట్టి వారిని యేసుక్రీస్తు పిలువ లేదు, ఈనాడు కూడ పిలుచుట లేదు. ఆత్మ విషయమై దీనులైనవారిని ఆయన పిలుచుచున్నాడు. "ప్రయాసపడి భారము మోసుకొనుచున్న సమస్తజనులారా, నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను, నా భారము తేలికగాను ఉన్నవి" యని ఆయన పిలుచుచున్నాడు (మత్త 11:28-30).

పాపపు జీవితాన్ని జీవిస్తూ సంతోషంగానే యున్నానని మానవుడు తలంచునంత కాలము దాని భారాన్ని ఎరుగడు గనుక దానిని విసర్జించాలని ఎంచడు. తనకు రక్షకుడవసరమని భావించడు గనుక ఆయనను వెదుకడు. "మహా ఘనుడును మహోన్నతుడును పరిశుద్ధుడను, నిత్యనివాసియు నైనవాడు యీలాగు సెలవిచ్చుచున్నాడు. నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములలో నివసించువాడను, అయినను వినయముగలవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును, వినయముగలవారి యొద్దను దీనమనస్సు గలవారి యొద్దను నివసించుచున్నాను" (యెషయా 57:15). మరియు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు: "ఆకాశము నా సింహాసనము, భూమి నా పాదపీఠము. మీరు నా నిమిత్తము కట్టనుద్దేశించు ఇల్లు ఏపాటిది? నాకు విశ్రమస్థానముగా మీరు కట్టనుద్దేశించునది ఏపాటిది? అవన్నియు నాహస్త కృత్యములు. అవి నావలన కలిగినవని యెహోవా సెలవిచ్చుచున్నాడు. ఎవడు దీనుడై నలిగిన హృదయము గలవాడై నామాట విని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను" (యెషయా 66:1-2).

ఆత్మ విషయమై దీనులైనవారు తమ్మునుతాము రక్షించుకొను

టకు శక్తిలేనివారని యెరిగినవారు, తమ యిష్టానుసారముగ నడచుటకు శక్తిలేని వారని యెరిగినవారు. ఏలయనగా తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదు. మనుష్యులు తమ ప్రవర్తన యందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదు (యిర్మి 10:23). మనము ఆత్మీయ విషయాల్లో కడు నిరుపేదలం. దీనిని గుర్తించినప్పుడు దేవునిపై ఆధారపడుదుము. మానవుడు పాపమునుగూర్చి శిక్ష విధింపబడిన వాడని ఎరుగకుండిన యెడల, లేదా దానినిగూర్చి లెక్క చేయకుండిన యెడల అతడు బహు దుఃఖకరమైన స్థితిలో యున్నవాడు. ఏలయనగా అతనికి ఎవరు యేమీ చేయలేరు. అయితే పాపములోపడి నశించిపోవుచున్నానని యెరిగి, దానిని గూర్చి దుఃఖించుచున్న యెడల అట్టివానికి సహాయం చేయగలము. అతని స్థితి ధన్యకరమైనది.

ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులన్నప్పుడు ఈలోకంలో బీదవారు ధన్యులని యేసుప్రభువు యొక్క ఉద్దేశ్యం కాదు. ఈలోక ధనాన్ని గూర్చి బైబిలు మనలను హెచ్చరించుచున్నను ధనహీనులై యుండుట సద్గుణమని అది బోధించుటలేదు. ఆత్మ విషయమై దీనులై యుండుటనగా దేవుని దృష్టిలో తన్ను తాను తగ్గించుకొనుట, విరిగి నలిగిన హృదయం కలిగియుండుట. మనం పాపులమని మనస్వనీతి అంటూ యేమీ లేదని ఎరిగియుండుట. దేవుడు మనలను ఏస్థితిలో ఎక్కడఉంచితే అక్కడ ఆ స్థితిలో యుండాలి. ఆయన ఎక్కడకు వెళ్ళమంటే అక్కడకు వెళ్ళాలి. ఆయన ఆజ్ఞాపించినది చేయాలి. దేవుడు మన అంతరంగ తత్వాన్ని గమనిస్తున్నాడు గాని బాహ్యవేషాన్ని కాదు. మన సూటు, బూటులను, వేషభాషలనుగాక దీనమనస్సును ఆయన కోరుచున్నాడు. అందుకే దావీదు మహారాజు ఇట్లనుచున్నాడు: "నీవు నీతిని కోరువాడవుకావు. కోరినయెడల నేను అర్పించుదును.

దహనబలి నీ కిష్టమైనది కాదు. విరిగిన మనస్సే దేవుని కిష్టమైన బలులు. దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు" (కీర్త 51 : 16, 17). యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగము లోని మొదటి ధన్యతలో ఈలోక సంబంధమైన విషయాల్లో లేమి కలిగియుండుటను గాక, పరలోక రాజ్యపు ఆనందాన్ని అనుభవించుట కవుసరమైన ఆత్మీయ దీనత్వాన్ని, విరిగి నలిగిన మనస్సును ఆయన వార్షించుచున్నాడు. పరలోక రాజ్యము అట్టివారిదే. ఇంకోమాటలో క్రీస్తు సంఘంలో ఉండదగినవారు అట్టివారే.

ఒకడు ఆత్మ విషయమై దీనుడై యుండి ఈలోక విషయాల్లో కూడ దీవించబడి యుండుట, ధనవంతుడై యుండుట సాధ్యమే. అట్టి వారు ధనాన్ని వశముచేసుకొన్న వారుగాని ధనముచేత వశము గావించబడినవారు కారు. దేవుని చిత్తాన్ని జరిగించుట కొరకు అవుసర మైతే అట్టివారు ధనాన్ని విసర్జిస్తారు. అట్టివారు భక్తుడైన యోబు వలె "నేను నాతల్లి గర్భములోనుండి దిగంబరినై వచ్చితిని. దిగంబరినై అక్కడికి తిరిగి వెళ్ళెదను. యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొని పోయెను. యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక" అని చెప్పు దురు (యోబు 1:21). ఎవరైతే వినయ విధేయతలు కలిగియుంటారో, ఎవరైతే తమ్మును తాము రిక్తులుగా చేసికొంటారో అట్టివారిని దేవుడు రక్షిస్తాడు, దీవిస్తాడని లేఖనములు బోధించుచున్నవి. సహజతత్వాన్ని బట్టి మనం స్వనీతిపరులము. దేవుడు మనకు మేలుచేయ తగినవారమని తలుస్తాము. అయితే మనుష్యులు ఘనంగా ఎంచుకొనే దానిని దేవుడు ద్వేషిస్తాడు. అహంకారులను, గర్విష్టులను, స్వనీతిపరులను దేవుడు తీర్పులోనికి తెస్తాడు.

ఆత్మ విషయమై దీనులైనవారు తమ హృదయాన్ని, మనస్సును దేవుని దగ్గర వలకబోస్తారు. అప్పుడు దేవుడు వారి హృదయాలను

మనస్సును నింపుతాడు. పరలోక రాజ్యము వారిది. ఈ మొదటి ధన్యత ఒక పునాదివంటి. తిరిగి జన్మించిన ప్రతివాని ఆత్మ లేక జీవితం ఈ దీనత్వాన్ని ప్రతిబింబింప జేస్తాది. ఆత్మ విషయమై దీనులైనవారిని గూర్చి యేసుప్రభువు మొదట ఎందుకు చెప్పారు? ఆయన ఒక క్రొత్త జీవిత విధానాన్ని గూర్చి, ఒక క్రొత్త జీవనస్థాయిని గూర్చి, జీవన మార్గాన్ని గూర్చి బోధించుచున్నాడు. దేవుని రాజ్యంలో లేక క్రీస్తు సంఘంలో ప్రవేశించాలంటే మానవుడు మొదటిగా ఆత్మ విషయమై దీనత్వాన్ని కలిగియుండాలి. తాను నిస్సహాయుడనని గుర్తించి సహాయం కొరకు క్రీస్తుదరికి చేరాలి. మనం స్వనీతినుండి దూరపర్చబడినప్పుడు (కీర్తన 131:2), ప్రభువు యొక్క మహిమలో తన్మయులమైనప్పుడు (కీర్తన 17:5; 2 కొరింథీ 3:18), యితరుల మంచి తనాన్ని, మన పొరబాట్లను ఎరిగియుండి నప్పుడు (మత్త 7 : 1-5), ఎక్కువ సమయాన్ని ప్రార్థనలో గడుపునప్పుడు (లూకా 11 : 15), క్రీస్తుయొక్క షరతులమీదనే ఆయన నంగీకరించినప్పుడు (యోహాను 14:15), మనం ఆత్మ విషయమై దీనులైనవారమని గ్రహించుకోవచ్చు.

నీవింకను క్రీస్తుకు నీ జీవితాన్ని అర్పించనియెడల ఆయనే దేవుని కుమారుడని విశ్వసించుము. నీ పాపముల విషయమై మారు మనస్సు బొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు పరలోక రాజ్యంలో ప్రవేశించగలవు.

—జాషువా గూటం.

---

## ఈ లోకంలో సర్వశ్రేష్టమైనది

## ( The Greatest Thing in the World )

ఇశ్రాయేలీయులు దేవుని ప్రేమించాలని ఆజ్ఞాపింపబడిరి (ద్వితీ 6:5). వారు తమ పొరుగువారిని ప్రేమించాలని ఆజ్ఞాపింపబడిరి (లేవీ

19:18). ఈ సూత్రముల వలన తమ యిరుగుపొరుగు వారి మతముల కంటె యూదుల దేవుని మతము ఉత్కృష్టమైనది. ఇశ్రాయేలీయులు అన్యుల మతముల నంగీకరించి, దేవుని మార్గమును విడచినందున పాపములో బడిరి.

భ్రష్టత్వములో పడినవారి పరిస్థితిని యిర్మీయా యిట్లు వర్ణించాడు: "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. మార్గములలో నిలచి చూడుడి, పురాతన మార్గములను గూర్చి విచారించుడి. మేలు కలుగు మార్గమేది అని యడిగి అందులో నడుచుకొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును" (యిర్మీ 6:16). క్రొత్త నిబంధన మార్గము మరింత శ్రేష్టమైన మార్గమై యున్నది.

యోహాను 3 : 16ను బైబిలులోని బంగారు వచనమని చెప్పుకొంటాము: "దేవుడు లోకము నెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". సిలువపై మరణించుట వలన యేసు ఆ ప్రేమను నిరూపించెను.

ప్రేమ యిచ్చి పుచ్చుకొనునది. ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనమును ప్రేమింతుము (1 యోహాను 4:19). మనము యేసును ప్రేమించుచున్నామా? అయితే "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని ఆయన పరీక్షపెట్టుచున్నాడు (యోహాను 14:15).

ప్రేమించినప్పుడు మనము విధేయత చూపుదుము. "మన మాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (1 యోహాను 5:3). విశ్వాసము ఒక్కటి మాత్రమే

చాలునని, అది సర్వశ్రేష్ఠమైన సిద్ధాంతమని డినామినేషన్లవారు చెబుతారు. అయితే ఆ మాట సత్యముకాదు. ఏలయనగా విశ్వాసము లేకుండా మనము దేవుని కిష్టులైయుండుట అసాధ్యమని హెబ్రీ 11:6 చెప్పుచున్నది. మరల ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరముగాని మరొకటి కాదని మనము చదువగలము (గలతీ 5:6). విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ, ఈ మూడింటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే (1 కొరింథీ 13:13).

యేసుప్రభువు సంపూర్ణసిద్ధి పొందినవాడై తనకు విధేయులైన వారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:10). గనుక "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు. ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహా : 9). క్రీస్తు బోధనే అనుసరించుచున్నామని అనేక సంఘములవారు చెప్పుకొంటారు. అట్లయితే సిద్ధాంతరీత్యా వారిలో వారికి అనేక వ్యత్యాసము లెట్లున్నాయి?

క్రీస్తు సంఘమునకు శిరస్సయి యున్నాడని కొలస్స 1:18 చెప్పుచున్నది. ఆయన అన్నిటికంటె ముందున్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియైయుండియు మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను. ఇహపరములయందు క్రీస్తుకే సర్వాధికారమియ్యబడియున్నది (మత్తయి 28:18). క్రీస్తు ప్రేమను మనం అంగీకరించి, ఆయనను తన సంఘములో ఆరాధిస్తూ సేవింతుముగాక. ఈ లోకంలో అంతకన్నా మిన్నయైన మార్గము మరొకటి లేదు !

—జె.సి. బెయిలీ.

— o —

# సత్యవాక్కు

క్రీస్తు యేసు వార్త-కీర్తిఁగాంచునటుల
సర్వలోకమందుఁ-జాటి చెప్పి
క్రీస్తు సంఘ మిలలో-కీర్తి కిరీటమై
కీర్తిఁగాంచవలెను-క్రీస్తునందు.

సత్యవాక్కు ఖడ్గ-సంపత్తిఁ జేబూని
పాప కిల్బిషంబుఁ-బాపుచుండె
వాడ వాడ లందు-వర్ధిల్లు చున్నది
క్రీస్తు సంఘ ఘనత-కీర్తిఁగాంచి.

సత్యవాక్కు భువిని-చాటించి చెప్పాలి,
మార్గ సత్యజీవ-మంచి నెఱిగి;
సత్యవాక్కు తోడ-సంతృప్తిఁగావించి
నిత్యజీవ మందు-నిల్పు మిమ్ము.

ఉచిత సేవఁజేసి-ఉజ్జీవ మిచ్చెడి
ఉత్తమమైన సంఘ-ముర్విలోన
క్రీస్తు సంఘ మొకటె-కీర్తి నొంద భువిని
చేరండి! సంఘ-సేవఁజేయ.

సత్యవాక్కు కొఱకు-సంఘస్థు లెల్లరు
వేచియుందు రోయి! వేడ్క-మీరఁ
వేగిరంబె దానిఁ-విడుదలఁజేయండి.
సంఘ సభ్యులెల్ల-సంతసింపఁ.

—వల్తాటి జోసఫ్, నంద్యాల.

—o—

(టైటిలు 2వ పేజీ తరువాయి)
సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సువార్తకూటము రాత్రి 12-30 గంటల వరకు ప్రజల ఆసక్తినిబట్టి కొనసాగించబడెను.

అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేసిన దేవునిని మానవుడు ఆరాధించవలసిన వాడై యున్నాడు. ఆరాధనామూర్తి ఆయనే. "మన దేవుడైన యెహోవాను ఘనపరచుడి, ఆయన పాదపీఠము ఎదుట సాగిలపడుడి. ఆయన పరిశుద్ధుడు" (కీర్త 99 : 5). "ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింప వలెను" (యోహా 4:24). అది ఎట్లు ? యిది మనముందున్న ప్రశ్న.

దేవుడు ఆత్మ అంటే ఆయన పదార్థము (Matter) కాదు. సర్వమూ వ్యాపించియున్న దేవుని ఎక్కడనుండి ఆరాధించిననూ ఆయన ఘనపరచబడును. ఆయనను సత్యముతో ఆరాధించవలెనంటే వాక్యానుసారంగా ఆరాధించాలి ఎందుచేతనంటే "ఆయన వాక్యమే సత్యము" యోహా 17 : 17.

పౌలు త్రోయకు వచ్చి ఆదివారమున అచ్చటి సంఘములో ఆరాధించుటకు ఏడు దినములు గడిపెను (అ. కా. 20 : 8) ఆదివారమున వారు రొట్టె విరచిరి. క్రైస్తవులు ఆరాధించవలసిన దినము ఆదివారమనునది నిర్వివాదాంశము. సత్యారాధనలో 5 అంశములున్నవి. పాటలు (మత్త 26 : 30) ప్రార్థన (1 థెస్స 5: 15) వాక్యోపదేశము (II తిమో 4 : 4) ప్రభు రాత్రి భోజనము (I కొరింథి 11 : 25) కానుకలు (I కొరింథి 16 : 1). ఆత్మతోను మనస్సుతోను ప్రార్థించవలెనంటే నీవు హృదయములోనుండి అర్థవంతముగ ప్రార్థించాలి మరియు పాడాలి (1 కొరి 14:15). క్రైస్తవ ఆరాధనలో ఏ అంశమును విస్మరించిననూ అది సత్యారాధన కాదు. సర్వసృష్టి దేవుని స్తుతించవలెను (కీర్త 148). ఆయనే ఆరాధనామూర్తి అని చెప్పిరి. మానవుడు కోల్పోయిన ఆత్మీయ స్థితి నుండి పునరుద్ధరింప బడుటకు ఆయనను ఆరాధించవలెను. ఆరాధనలో దైవ మానవాత్మల కలయిక కలదు. యిదే క్రీస్తుయొక్క సారూప్యమును పొందుటకు దోహదపడును.

సోదరులు **P.J.** కృపాలనీగారు వారి సతీమణి నిర్విరామ కృషి చేసి సువార్తికుల సదస్సును జయప్రదం చేసిరి. పలివెల క్రీస్తుసంఘ సభ్యులు వెంకటారావుగారు, వారి సతీమణి ధనలక్ష్మిగారు స్థానిక సంఘస్థులతో సహా వందలాది సువార్తికులకు చక్కని పరిచర్యచేసి అందరి మన్ననలను పొందిరి. మార్చి నెల సువార్తికుల సదస్సు 22వ తేదీ మంగళవారం రామచంద్రపురం దగ్గరయున్న **G.** కొత్తూరులో **M.** సాల్మన్‌గారి ఆధ్వర్యమున జరుగును.

ఫిబ్రవరి 26, 27, 28 తేదీలలో వరంగల్లు పట్టణములో గొప్ప బహిరంగ సువార్త కూటములు పుప్పాలగుట్ట క్రీస్తు సంఘ ఆవరణలో జరిగెను. సోదరులు నెహెమ్యా గూటంగారు, జాషువా గూటంగారు, వై. లాజరుగారు వాక్యోపదేశము చేసిరి. జనులు వేలకొలది సంఖ్యలో హాజరైరి. మూడు రోజులలోను 137 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. స్థానిక క్రైస్తవులు ధారాళముగా కానుకలిచ్చి ఉచిత భోజన వసతి సౌకర్యములు దూరప్రాంతముల వారికి ఏర్పాటు చేసిరి. సోదరులు కె. సత్యనారాయణగారు, వారి సహచరులు వరంగల్లులోను పరిసర ప్రాంతములలోను క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

---

**Regd. No. H/KD—45/KD H.O**

**From**
**SATYAVAKKU**
**P.O. Box 80**
**KAKINADA 533 001**

**No.**

**To**

..............................
..............................
..............................
..............................